సాక్షి
విజయనగరం
బుధవారం ꠰ 23 ꠰ జూలై ꠰ 2025



ఆందోళన కంపెనీ పేరుతో జిందాల్ లాక్కున్న భూములు తిరిగి అప్పగించాలంటూ నిర్వాసితులు మంగళవారం బొడ్డవరలో మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. రైతులకు న్యాయం చేసేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కోరారు. – ఎస్.కోట



అందానికి అందం ఎర్ర చందనం..!

కళ్లు చెదిరే ధర..మన్నికకు మన్నిక..ఇంట్లో ఉంటే శుభకరం. ఏజెన్సీ ప్రాంతాల్లో ఎర్రచందనం తోటలను స్థిరాస్తిగా సాగుచేస్తున్నారు. - 8లో

న్యూస్‌రీల్

అగ్రిగోల్డు భూముల మ్యుటేషన్ ప్రక్రియ పూర్తిచేయండి

- జేసీ సేతు మాధవన్



మాట్లాడుతున్న జేసీ సేతుమాధవన్

విజయనగరం అర్బన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో అగ్రిగోల్డు భూముల మ్యుటేషన్ ప్రక్రియను వెంటనే పూర్తిచేయాలని రెవెన్యూ అధికారులను జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ ఆదేశించారు. అగ్రిగోల్డు భూములకు సంబంధించి జిల్లాస్థాయి కమిటీ సమావేశం జేసీ చాంబర్‌లో మంగళవారం జరిగింది. రామభద్రపురం, మెంటాడ, గజపతినగరం, విజయనగరం మండలాల్లో ఉన్న అగ్రిగోల్డు సంస్థ ఆస్తులు, వాటి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. భూముల రీ సర్వే, భౌతిక పరిశీలనపై ఆరా తీశారు. మర్కెట్ విలువను లెక్కించి ఇవ్వాలని జిల్లా రిజిస్ట్రార్‌కు సూచించారు. బుధవారం సాయంత్రంలోగా వ్యవసాయ భూముల మ్యుటేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. భూముల మ్యుటేషన్ పూర్తయిన తరువాత వేలం వేస్తామని చెప్పారు. సమావేశంలో డీఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తి, సీఐడీ డీఎస్పీ ఎం.ఎస్.భూపాల్, నాలుగు మండలాల తహసీల్దార్లు, వివిధ శాఖల ప్రతినిధులు, సీఐడీ ఇన్‌స్పెక్టర్లు, కలెక్టరేట్ అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ సేవలను మరింత చేరువ చేస్తాం

- ఎస్పీ వకుల్ జిందల్



పోలీస్ అవుట్ పోస్టును ప్రారంభిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

గంట్యాడ: పోలీస్ సేవలను మరింత చేరువచేసేందుకు పోలీస్ అవుట్‌పోస్టును ఏర్పాటుచేసినట్టు ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. గంట్యాడ మండలం తాటిపూడి గ్రామంలో ఏర్పాటుచేసిన పోలీస్ అవుట్ పోస్టును మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ కల్పించడం కోసం అవుట్ పోస్టును ప్రారంభించామన్నారు. తాటిపూడి జలాశయం చూసేందుకు, బోటింగ్‌కు పర్యాటకుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోందని, ఈ ప్రాంతంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా నియంత్రించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. జలాశయంలో బోటింగ్‌కు వెళ్లే సమయంలో టూరిస్టులు తప్పనిసరిగా లైఫ్ జాకెట్స్‌ను వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సౌమ్యలత, విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, ఎస్బీ సీఐ ఎ.వి.లీలారావు, విజయనగరం రూరల్ సీఐ బి.లక్ష్మణరావు, ఎస్ఐ డి.సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అంతిమ యాతన..!



కనుమలచెరువు గర్భంలో నుంచి మృతదేహాన్ని తరలిస్తున్న వీలుపర్తివాసులు

వేపాడ: మండలంలో వీలుపర్తి గ్రామంలో కొన్ని కులాలకు కేటాయించిన శ్మశానానికి వర్షాకాలంలో వెళ్లాలంటే నరకయాతన తప్పదు. గ్రామానికి చెందిన గుమ్మలగోవింద అనే మహిళ అనారోగ్యంతో మంగళవారం చనిపోయారు. మృతదేహాన్ని తరలించేందుకు రోడ్డు మార్గంలేకపోవడంతో కనుమలచెరువులో నడుంలోతు నీటిలో దిగి తీసుకెళ్లారు. అధికారులు స్పందించి శ్మశానానికి రోడ్డు సదుపాయం కల్పించాలని గుమ్మాల రమణ, లక్ష్మణ తదితరులు కోరారు.

పైడితల్లికి ఆషాఢం సారె



పైడితల్లి చదురుగుడి వద్దకు సారెతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారికి మంగళవారం సాయంత్రం శ్రీ సింహాశైల సేవా సమితి ప్రతినిధి, టీటీడీ ధార్మిక కమిటీ సభ్యురాలు ఎస్.హరిలక్ష్మి ఆధ్వర్యంలో ఆషాఢం సారెను భక్తులు సమర్పించారు. విజయనగరం లయన్స్ క్లబ్ వద్ద నుంచి కోట కూడలి మీదుగా మేళతాళాలు, కోలాట ప్రదర్శనలు, పులివేషధారణలు, భక్తుల భజనల నడుమ ఊరేగింపుగా సారెను తీసుకెళ్లారు. అమ్మవారికి పసుపు, కుంకుమలు, పువ్వులు, వివిధ రకాల స్వీట్లు, పండ్లను సమర్పించారు. ఆలయ అధికారులు, సిబ్బంది భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

– విజయనగరం టౌన్



అమ్మవారికి సారెను చూపిస్తున్న మహిళలు



అమ్మవారి వద్ద ఉంచిన సారె..



మహిళల కోలాట ప్రదర్శన

నిఘా వైఫల్యం..!

- జిల్లా పోలీస్ కార్యాలయంలో చొరబడిన అజ్ఞాత వ్యక్తి

విజయనగరం క్రైమ్: హోంమంత్రి పర్సనల్ సెక్రటరీని అంటూ జిల్లా పోలీస్ కార్యాలయాన్నే ఓ వ్యక్తి బురిడీ కొట్టించి ప్రవేశించాడు. విజయనగరం జిల్లా కేంద్రంలో జరిగిన ఈ ఘటన పోలీస్ నిఘా వైఫల్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. గతంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటనలో ఓ నకిలీ ఎస్సై హడావిడి చేసిన విషయం తెలిసిందే. డీపీఓలోకి అడుగు పెట్టాలంటే మామూలు విషయం కాదు. ఎస్పీ కార్యాలయం ప్రధాన గేటు నుంచి కేవలం పోలీస్ సిబ్బంది వాహనాలను మాత్రమే అనుమతిస్తారు. డీపీఓకు ఎవరు వచ్చినా వెనుక నుంచి పీటీసీ మీదుగా అదీ ఏఆర్ సిబ్బంది పెట్టే వెహికల్స్ నుంచి రావాల్సిందే. ఇక ఎస్పీని కలవాలంటే ప్రతి ఒక్కరికీ కష్టమే. ఏకంగా హోంమంత్రి అనిత పీఎస్ నంటూ, అదీగాక పొరుగు రాష్ట్రానికి చెందిన వ్యక్తి జిల్లా పోలీస్ కార్యాలయం లోపలికి చొరబడడం, ఓ మహిళా కానిస్టేబుల్‌పై జులుం ప్రదర్శించడం నిఘా వైఫల్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. హోం మంత్రి పీఎస్ అని చెబితే ఓ అజ్ఞాత వ్యక్తిని ఎలా అనుమతించారన్నది చర్చనీయాంశంగా మారింది. మహిళా పోలీస్ ఫిర్యాదుతో నిందితుడిని పట్టుకుని రిమాండ్‌కు తరలించినా పోలీసుల నిఘా వైఫల్యంపై విమర్శలు వినిపిస్తున్నాయి.


పేదల భూములపై పెద్దల కన్ను!





పెదరావుపల్లి గ్రామంలో గ్రీన్‌హబ్ పేరిట కూటమి ప్రభుత్వం గుర్తించిన భూములు

- గ్రీన్‌హబ్ పేరుతో భూములు కొట్టేసే పన్నాగం!
- ఇప్పటికే సుమారు 3 వందల ఎకరాలకు పైగా కారుచౌకగా సేకరణ
- పారిశ్రామిక వేత్తలకు కేటాయింపు
- మళ్లీ భూముల్లోకి వస్తున్న అధికారులను చూసి ఆందోళనలో రైతన్నలు



పెదరావుపల్లి గ్రామంలో గ్రీన్‌హబ్ పేరిట గుర్తించిన భూముల మ్యాప్



పెదరావుపల్లి గ్రామస్తుల భూములకు గత ప్రభుత్వం రీ సర్వే జరిపి రైతులకు హక్కులు కల్పిస్తూ ఇచ్చిన పట్టాదారు పాసుపుస్తకం

కొత్తవలస:

తాతముత్తాతల నుంచి సాగుహక్కుగా వస్తున్న భూములవి. ఆ భూముల్లో పండించిన పంటలే వారికి జీవనాధారం. గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సమగ్ర రీ సర్వే చేసి శాశ్వత భూ హక్కులు కల్పించడంతో సంతోషపడ్డారు. దశాబ్దాల సమస్యకు పరిష్కారం లభించిందనుకున్నారు. అయితే, ఆ భూములు భోగాపురం ఎయిర్‌పోర్టుకు కేవలం 50 కిలోమీటర్ల దూరంలో విశాఖపట్నం మహానగరానికి చేరువలో ఉండడంతో కూటమి పెద్దల కన్నుపడింది. ఎలాగైనా భూములను కైవశం చేసుకునేందుకు కొందరు ప్రయత్నాలు ఆరంభించారు. వివిధ ప్రాజెక్టుల పేరుచెప్పి రోజుకో సర్వేచేయిస్తున్నారు. దీంతో కొత్తవలస మండలంలోని చింతలపాలెం, అర్ధన్నపాలెం, పెదరావుపల్లి, వీరభద్రపురం తదితర గ్రామాల పేద రైతులు ఆందోళన చెందుతున్నారు.

గ్రీన్‌హబ్ పేరుతో ప్రభుత్వ భూముల అన్వేషణ

విశాఖపట్నం మెట్రోపాలిటీ రీజియన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ (వీఎంఆర్‌డీ) ఆధ్వర్యంలో గ్రీన్‌హబ్‌ల పేరిట అభివృద్ధికోసం మండలంలోని పెదరావుపల్లి, వీరభద్రపురం, అర్ధన్నపాలెం, చింతలపాలెం గ్రామాల్లో ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఆ భూముల పరిశీలనకు వీఎంఆర్‌డీ కమిషనర్, జిల్లా రెవెన్యూ అధికారులు ఇప్పటికే పలు మార్లు పర్యటించారు. ఆ భూములు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి సుమారు 50 కిలోమీటర్లు, గ్రీన్‌ఫీల్డు హైవేకు 5 కిలోమీటర్ల చేరువలో ఉన్నందున గ్రీన్‌హబ్ పేరిట రైతుల నుంచి భూములు సేకరించే పనిలో ప్రభుత్వ యంత్రాంగం ఉంది. చింతలపాలెం రెవెన్యూలో 15.30 ఎకరాలు, అర్ధన్నపాలెంలో 29.56 ఎకరాలు, పెదరావుపల్లిలో 72.18 ఎకరాలు, వీరభద్రపురం రెవెన్యూలో 15 ఎకరాలను గుర్తించింది. భూములపై క్లారిఫికేషన్ వివరాలను రెవెన్యూ అధికారులు ఇప్పటికే సేకరించారు.

అందరి కన్నూ ఆ భూములపైనే...

ఇప్పటికే చిన్నరావుపల్లి, పెదరావుపల్లి గ్రామ రెవెన్యూలో పతంజిలి ఫుడ్ ప్రాసెస్ యూనిట్ల ఏర్పాటుకు సుమారు 196 ఎకరాలను 2017 సంవత్సరంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ఎకరా కేవలం రూ.8 లక్షలకే కట్టబెట్టేసింది. ఈ భూముల్లో నేటికీ పరిశ్రమలు స్థాపించ లేదు. మరో మారు కూటమి పెద్దలు వివిధ ప్రాజెక్టుల ముసుగులో పెదరావుపల్లి భూములను కొట్టేసేందుకు ప్రయత్నిస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ఆందోళనలో రైతులు

అర్ధన్నపాలెం, వీరభద్రపురం, చింతలపాలెం గ్రామాల్లో కొండపోరంబోకు భూములు ఉన్నాయి. ఆ భూములు ప్రస్తుతం రైతుల సాగులో ఉన్నాయి. పెదరావుపల్లి గ్రామంలోని సర్వేనంబర్ 48 నుంచి 62 వరకు ఉన్న భూముల్లో సుమారు 60 మంది రైతులు తమ పూర్వీకులనుంచి మామిడి తోటలు సాగుచేస్తున్నారు. ఈ తోటలపై వచ్చే ఆదాయంతో కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. ఈ భూములపై హక్కులు కల్పించాలని 1986 సంవత్సరంలో రైతులు ఎస్.కోట కోర్టును ఆశ్రయించారు. వారికి అనుకూలంగా 1996లో తీర్పువచ్చినా అప్పటి టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. 2016లో మళ్లీ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు కూడా రైతులకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా అధికారులు పట్టించుకోలేదు. 2019 సంవత్సరంలో అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 2022లో గ్రామంలో సమగ్ర రీ సర్వే నిర్వహించి రైతులందరికీ డీ పట్టాలను అందజేసింది. రైతులకు శాశ్వత హక్కులను కల్పిస్తూ పట్టాదారు పుస్తకాలను కూడా జారీచేసింది.

జగనన్న ప్రభుత్వం హక్కులు కల్పించింది



ఏళ్ల తరబడి భూ హక్కుల కోసం అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఫలితం లేకపోయింది. గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం భూముల రీ సర్వేలో మాకు శాశ్వత హక్కులు కల్పించింది. ఏళ్లతరబడి సాగుచేస్తున్న భూములను ఏవో కొత్తకొత్త ప్రాజెక్టుల పేర్లు చెప్పి కాజేసేందుకు కూటమి పెద్దలు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే మా గ్రామంలో సగం భూములను కారుచౌకగా పతంజిలి సంస్థకు కట్టబెట్టారు. మరో మారు మా భూములు ఇచ్చే ప్రసక్తేలేదు.

– కిలపర్తి పరిదేశినాయుడు, ఎంపీటీసీ, పెదరావుపల్లి గ్రామం

ఏం తిని బతకాలి



ఇప్పటికే సగానికి పైగా పరిశ్రమల పేరిట మా భూములను గతంలో తెలుగుదేశం ప్రభుత్వం తీసేసుకుంది. ఆ భూముల్లో పరిశ్రమలు కట్టారా అంటే అదీ లేదు. మరో మారు ఉన్న భూములు కూడా తీసేసుకుంటామంటే ఏం తినిబతకాలి. పచ్చపార్టీవారికి మా భూములే కనిపిస్తున్నాయా?.

– పోలిపర్తి అప్పారావు, రైతు, పెదరావుపల్లి గ్రామం

వీఎంఆర్‌డీకి నివేదికలు పంపాం



ప్రస్తుతానికి చింతలపాలెం గ్రామం రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 103లో సుమారు 50 ఎకరాలకు సంబంధించిన నివేదికలను వీఎంఆర్‌డీకి పంపించాం. ఆ భూమి పూర్తిగా కొండపోరంబోకు, రైతుల అనుభవంలో లేనట్టు గుర్తించాం. మిగిలిన గ్రామాల్లోని భూముల వివరాలను సేకరిస్తున్నాం. వాటి వివరాలను త్వరలోనే నివేదిస్తాం.

– పి.అప్పలరాజు, తహసీల్దార్, కొత్తవలస

బలవంతంగా లాక్కుంటారా?



దశాబ్దాలుగా సాగుచేస్తున్న మా భూములకు గత ప్రభుత్వం హక్కులు కల్పించింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం లాక్కునేందుకు చూస్తోంది. ఇప్పటికే మేము చాలా నష్టపోయాం. ప్రభుత్వ పెద్దలు గ్రహించాలి.

– కిలపర్తి రామకృష్ణ, రైతు, పెదరావుపల్లి గ్రామం

దేవదాయశాఖ భూముల పరిరక్షణకు చర్యలు

- ఆక్రమణదారులకు నోటీసులు
- వ్యాపారులకు హెచ్చరికలు జారీచేసిన దేవదాయశాఖ ఏసీ శిరీష



దేవదాయశాఖకు చెందిన భూముల్లో అక్రమ నిర్మాణ షాపులను సీజ్‌చేస్తున్న ఏసీ శిరీష

రాజాం: దేవదాయ, ధర్మాదాయశాఖకు చెందిన భూములను పరిరక్షిస్తామని ఆ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ కె.శిరీష తెలిపారు. రాజాం పట్టణంలో జీఎంఆర్ కేర్ ఆస్పత్రి రోడ్డులోని దేవదాయశాఖ భూములను మంగళవారం పరిశీలించారు. అక్రమ నిర్మాణాలు చేపట్టినవారిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. నెలరోజుల్లో అంతా ఖాళీచేయాలని ఆక్రమణదారులకు నోటీసులు జారీచేశామని, మరో వారం రోజులు గడువు ఇస్తున్నామని, ఖాళీ చేయకుంటే మొత్తం తొలగిస్తామని హెచ్చరించారు. డోలపేటలోని శ్రీ ఉమామహేశ్వర, లక్ష్మీనారాయణ స్వామి దేవాలయాలకు చెందిన భూముల స్వాధీనానికి కోర్టు ఆదేశాలిచ్చిందన్నారు. ఆక్రమణదారులు ధర్మంగా ఖాళీ చేస్తే మంచిదని, లేదంటే చట్టపరమైన శిక్ష తప్పదన్నారు. దేవదాయశాఖ భూముల్లోని దుకాణాలన్నింటిని వారంరోజులు తర్వాత తమ ఆధీనంలోకి తీసుకుని, మరో 15 రోజులు తర్వాత వేలంపాట వేసి అప్పగిస్తామన్నారు. జీఎంఆర్ ఐటీ కళాశాల పక్కన దేవదాయశాఖ భూమిలో వెలసిన దుకాణాలను సీజ్ చేశారు. రాజాం పట్టణంలో సారధిలో పలు వీధుల్లో నిషేధిత జాబితాలో ఉన్న భూములు పరిశీలించారు. కస్పావీధి, తాణావీధి, ఆశపు వీధి, అగ్రహారం వీధి ప్రాంతాల్లోని దేవదాయశాఖ భూములను సర్వేయర్ సత్యనారాయణ సమక్షంలో సర్వేచేయించారు. నివేదికలు ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. ఆమె వెంట ఈఓ మాధవరావు, వాకచరల్ల రాజా, అమర్, శంకర్, శ్రీరాములు, మురళీ తదిరుల ఉన్నారు.

వైద్యుడికి షోకాజ్ నోటీస్

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రేడియాలజీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎం.శివశ్రీధర్‌కు వైద్య విద్య సంచాలకులు (డీఎంఈ) నరసింహులు మంగళవారం షోకాజ్ నోటీస్ జారీ చేశారు. 15 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని నోటీస్‌లో పేర్కొన్నారు. గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో పనిచేసే సమయంలో 2022 మార్చి 26 నుంచి 2024 మే7 వరకు అనధికారికంగా విధులకు గైర్హాజయ్యారు. 2024 అక్టోబర్ నెలలో మళ్లీ విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాలకు రీపోస్టింగ్ ఆర్డర్స్ తెచ్చుకుని చేరారు.

నిబంధన ప్రకారం ఏడాది పాటు విధులకు గైర్హాజరైతే విధుల నుంచి తొలిగించాలన్నది నిబంధన. రెండేళ్లకు పైబడి విధులకు గైర్హాజరైన వైద్యునికి రీ పోస్టింగ్ ఆర్డర్ ఇవ్వడం వైద్యవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.


‘ఆడబిడ్డ నిధి’కి ఎగనామం!

ఎన్నికల సమయంలో ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్లు నిండిన పేదకుటుంబాల మహిళలకు నెలకు రూ.1500 చొప్పున ఇస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. ఇప్పుడు ఆ హామీని విస్మరించేలా.. పథకం అమలు చేయాలంటే ఆంధ్రప్రదేశ్‌ను అమ్మేయాలన్న వ్యవసాయశాఖమంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యలపై మహిళాలోకం భగ్గుమంటోంది. కూటమి తీరును వైఎస్సార్‌సీపీ నేతలు దుయ్యబట్టారు.

– రాజాం/బొబ్బిలి/దత్తిరాజేరు



మహిళలంటే చిన్నచూపు



కూటమి ప్రభుత్వానికి మహిళలంటే చిన్నచూపు. ఎన్నికల్లో 18 ఏళ్లు నిండిన అర్హులైన మహిళలందరికీ ఆడబిడ్డ నిధి పథకం కింద నెలకు రూ.1500 ఇస్తామని నమ్మించారు. తీరా పథకం అమలుచేయాలంటే రాష్ట్రాన్ని అమ్మాలంటూ మంత్రి అచ్చెన్నాయుడు మాటలు చూస్తుంటే మహిళలను మోసం చేసేందుకు సిద్ధమైనట్టే కనిపిస్తోంది. దీనిపై మహిళలు ఉద్యమించాలి. నాయకులను ప్రశ్నించాలి.

– బొత్స అప్పలనరసయ్య, గజపతినగరం మాజీ ఎమ్మెల్యే


ఆ రోజు ఈ లెక్కలు ఏమయ్యాయి



గెలుపే లక్ష్యంగా చేసుకుని లేని పోని హామీలు ఇవ్వడం టీడీపీ నేతలకు వెన్నతో పెట్టిన విద్య. ఈ దఫా సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ నేతలు ఎంతగా ఓటర్లను మోసగించారో ఇప్పుడిప్పుడే ప్రజలు గమనిస్తున్నారు. అర్హులైన మహిళలందరికీ నెలకు రూ. 1500 చొప్పున ఆడబిడ్డ నిధి ఇస్తామని చెప్పి, ఇప్పుడు పథకం అమలుచేయలేని స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని చెప్పడం విచారకరం. ఎన్నికలముందు సూపర్‌సిక్స్ హామీలు ఇచ్చినప్పుడు ఈ లెక్కలు ఏమయ్యాయో అచ్చెన్నాయుడే చెప్పాలి.

– డాక్టర్ తలే రాజేష్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్

రాష్ట్రాన్ని అమ్మి పథకాలిస్తామని నాడు హామీ ఇచ్చారా?



ప్రజలకు ఏ పథకాలు అమలు చేస్తే సుభిక్షంగా ఉంటారో ఆలోచించి పార్టీలు వారి మేనిఫెస్టోను ప్రచారం చేస్తాయి. మాటమీద నిలబడి వాటిని ఎంత కష్టమైనా అమలు చేస్తాయి. టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేస్తామని మేనిఫెస్టోలో పెట్టిన పథకాలను అమలు చేయడానికి రాష్ట్రాన్ని అమ్మేయాలని అనడం దారుణం. ప్రజలకు పార్టీల మీద, ప్రజాస్వామ్య వ్యవస్థ మీద నమ్మకం పోయే విధంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడటం దారుణం. ఆడబిడ్డ నిధి అమలు చేయకపోగా దానిని అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మేయాలని మహిళల సాక్షిగా వెకిలి నవ్వులు నవ్వుతూ ప్రసంగించడం అన్యాయం. అసలు మీరు రాష్ట్రాన్ని అమ్మేసి పథకాలు అమలు చేస్తామని గద్దెనెక్కారా? అప్పుడు అధికారంలో ఉన్న వైఎస్సార్‌సీపీ అమలు చేసి చూపించడంతో మరిన్ని పథకాలు అమలు చేస్తామన్నారు. సంపద సృష్టిస్తామన్నారు. ఇప్పుడు అమ్మేయాలంటున్నారు. ఏంటో మీ విధానాలు? ప్రజలంతా గమనిస్తున్నారు. త్వరలోనే మీరు పుట్టిమునిగే పరిస్థితులు వస్తాయి.

– శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, మాజీ ఎమ్మెల్యే, బొబ్బిలి

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

కొత్తవలస: మండలంలోని చీపురువలస గ్రామానికి చెందిన ఇంజినీరింగ్ పూర్తిచేసి ఉద్యోగ అన్వేషణలో ఉన్న యువకుడు రంధి వేణు(22) రోడ్డు ప్రమాదంలో సోమవారం రాత్రి దుర్మరణం చెందాడు. ఈ ఘటనకు సంబంధించి సీఐ షణ్ముఖరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామాన్ని ఆనుకుని నిర్మాణం జరుగుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే మీదుగా స్కూటీపై తన స్నేహితుడు మేడపురెడ్డి మోహన్‌తో కలిసి కొత్తవలస వచ్చేందుకు వేణు బయల్దేరాడు. జోరుగా వర్షం కురుస్తుండడంతో తడిసిపోతామనే ఆందోళనతో బైక్‌ను వేగంగా నడపగా బైక్ అదుపు తప్పి రోడ్డు రెయిలింగ్‌ను ఢీకొట్టింది. దీంతో వేణు పీకకు రెయిలింగ్ తగలగా కోసుకుపోయి అధిక రక్త స్రావం జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. స్కూటీ నడుపుతున్న మోహన్ తుళ్లి దూరంగా పడిపోగా తల, చేతులకు తీవ్రగాయాలయాయి. స్థానికులు ఈ ప్రమాదాన్ని గుర్తించి 108 వాహనానికి సమాచారం అందించగా వారు వచ్చి వేణు మృతి చెందినట్లు నిర్ధారించారు. మోహన్‌ను విశాఖపట్నం ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి వెంకటరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ షణ్ముఖరావు తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి..

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో మంగళవారం ఉదయం రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు బొబ్బిలి రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఈశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సుమారు 35 సంవత్సరాల వయస్సున్న వ్యక్తి రైలు పట్టాలు దాటుతుండగా లేదా రైలు దిగుతుండగా గాని ప్రమాదం జరిగి ఉండవచ్చన్నారు. ఆచూకి తెలిసిన వ్యక్తులు ఈశ్వరరావు రైల్వే హెచ్‌సీ ఫోన్ 9491813163,8309901038 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

చెరువులో మహిళ మృతదేహం

విజయనగరం క్రైమ్: విజయనగరం రూరల్ పోలీస స్టేషన్ పరిధిలో ఓ మహిళ మృతదేహాన్ని పోలీసులు మంగళవారం గుర్తించారు. మండలంలోని జమ్ము నారాయణపురం వద్ద ఉన్న కోమటి చెరువులో మహిళ మృతదేహం ఉందని స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ సమాచారం అందుకున్న రూరల్ ఎస్సై అశోక్ ఘటనా స్థలికి వెళ్లి, ఈతగాళ్ల సహాయంతో చెరువులో తేలియాడుతున్న మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతిచెందిన మహిళ వయస్సు సుమారు 40 నుంచి 45 ఏళ్ల మధ్య ఉంటుందని ఎస్సై అశోక్ తెలిపారు.మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించామని తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

రామభద్రపురం: మండలంలోని మిర్తివలస వద్ద పురుగు మందు తాగి ఓ యువకుడు మంగళవారం ఆత్మహత్యచేసుకున్నాడు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సాలూరులోని ఎరుకల వీధికి చెందిన పాలవలస శేఖర్ (24) ఆమ్లెట్ మాడిందన్న ఉద్దేశంతో భార్య ఆదిలక్ష్మితో గొడవ పడ్డాడు. దీంతో ఆమె తన కన్నవారింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో శేఖర్ మనస్తాపానికి గురై మిర్తివలస గ్రామం జంక్షన్‌లోని హెరిటేజ్ దుకాణం వద్ద పురుగు మందు తాగాడు. ఈ విషయం గమనించిన స్థానికులు ప్రథమ చికిత్స నిమిత్తం సాలూరు సీహెచ్‌సీకి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, పాప, బాబు ఉన్నారు. మృతుడి తండ్రి పైడిరాజు ఫిర్యాదు మేరకు ఏఎస్సై అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.



ఔషధం కోసం ఇంటిలో భద్ర పరిచిన రక్త చందనం బొమ్మలు



సీతంపేట సమీపంలో గిరిజనులు సాగు చేస్తున్న ఎర్రచందనం తోట

అందానికి అందం ఎర్ర చందనం..!

- ఔషధ గుణాలు మిన్న
- స్థిరాస్తిగా సాగు
- తరాలుగా చెక్కుచెదరని దృఢత్వం
- యథేచ్ఛగా మొక్కల అమ్మకం

భామిని: కళ్లు చెదిరే ధర..మన్నికకు మన్నిక..ఇంట్లో ఉంటే శుభకరం.. ఏజెన్సీ ప్రాంతాల్లో పెరుగుతున్న ఎర్రచందనం తోటలు అందానికి అందంగా ఉంటూ స్థిరాస్తిగా మొక్కల సాగు చేపడుతున్నారు. ఎర్ర చందనం ప్రత్యేకతలెన్నో దీని శాస్త్రీయ నామం టెరోకార్పస్ శాంటాలినస్. దీని కాండంలోని చేవ(ముదిరిన భాగం)కుంకుమ రంగులో ఉండడంతో రక్త చందనంగా పిలుస్తారు. చెట్టును నరికే సమయంలో సువాసన వెదజల్లుతుంది. శాఖోపశాఖలు లేకుండా నిటారుగా చెట్లు పెరుగుతాయి. దీని కాండం సుమారు 50 నుంచి 150 సెంటీమీటర్లు మాత్రమే విస్తరిస్తుంది. 20 నుంచి 30 అడుగుల వరకు చెట్లు నిటారుగా పెరుగుతాయి. పొలం గట్లు, ఇతర పంటలలో సాగు చేసినా పంటలకు నష్టం ఉండదు. దశాబ్దాల కాలంలో చెట్లు చేవదేరుతాయి. కొట్టేసిన చెట్లు మొదళ్ల నుంచి మళ్లీ మొలకలు పుట్టి చెట్లుగా ఎదగడం దీని ప్రత్యేకత. ఎర్రచందనం కలప దుంగల సాంద్రత నీటి స్పెసిపిక్ గ్రావిటీ కంటే తక్కువ కావడంతో నీటిలో మునుగుతాయి.

ఏజెన్సీల్లో విస్తరణ..

రెడ్‌శాండిల్ తోటలు పార్వతీపురం మన్యం జిల్లా సరిహద్దు ఏజెన్సీ ప్రాంతాలకు పాకుతున్నాయి. భామిని, సీతంపేట, పాలకొండ, పార్వతీపురం, కొమరాడ, మక్కువ, కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో రెడ్ శాండిల్ తోటలు విస్తరిస్తున్నాయి. ప్రధానంగా తివ్వాకొండ పరిసరాల్లో గిరిజనులు సైతం సాగు చేస్తున్నారు. కడియం నర్సరీ నుంచి అంటుకట్టిన మొక్కలు సులభంగా గ్రామాలకు



కొరమ సమీపంలో రియల్ ఎస్టేట్‌లో పెరుగుతున్న రెడ్‌శాండిల్ మొక్కలు

చేరుతున్నాయి. చివరికి అటవీశాఖ నిర్వహించే సామాజిక నర్సరీలలోనూ రెడ్‌శాండిల్ మొక్కలు పెంచి పంపిణీ చేస్తున్నారు. కొండ ప్రాంతాలతో పాటు పల్లపు ప్రాంతాల్లోనూ, రియల్ ఎస్టేట్ రంగంలో శాండిల్ సిటీలు వ్యాప్తి చెందుతున్నాయి. విద్యాసంస్థలలో సుందరంగా రక్త చందనం చెట్లు తోపులుగా పెరుగుతున్నాయి.

సాగుకు ప్రోత్సాహం..

అంతరించిపోతున్న వృక్ష,జంతు జాతుల వాణిజ్యంపై అంతర్జాతీయ ఒడంబడిక(సైట్స్) గతంలో విధించిన నిషేధాన్ని సడలించింది. ఎర్రచందనంతో తయారు చేసిన సంగీత వాయిద్యాలు, పరికరాలు, రసాయనాలు, రంగుల వంటి విలువ ఆధారిత ఉత్పత్తుల ఎగుమతులకు అనుమతులు ఇవ్వడానికి ప్రయత్నాలు సాగుతున్నాయి.



నిటారుగా పెరుగుతున్న చెట్లు

ఔషధ గుణాలు మెండు..

- లైంగిక సామర్థ్యం పెంపు కోసం వాడే వయగ్రా వంటి ఔషధాల తయారీలో ఎర్ర చందనం రసాన్ని వాడుతున్నారు.
- టెరోసిబిలిన్ రసాయనం లైంగిక సామర్థ్యం పెంచడంలో వయాగ్రా కన్న శక్తివంతమైంది.
- దీని బెరడు నుంచి తీసిన ఇథనాల్ రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను బాగా తగ్గిస్తుంది.
- మనిషి బరువులో కిలోకు 0.25 గ్రాముల చొప్పున ఎర్రచందనం ఇథనాల్ వాడితే మధుమేహం చక్కగా నియంత్రణలో ఉంటుంది.
- పూర్వీకులు ఎర్రచందనంలో ఔషధ గుణాలను గుర్తించి రోకళ్ల చేయించి ధాన్యాలు దంచేందుకు ఉపయోగించే వారు. శుభకరంగా భావించి దేవతామూర్తులు, ప్రతిమల రూపంలో పూజలు అందుకునేవి.
- దృఢత్వం, ఆకర్షణీయమైన రంగులోని ఎర్రచందనం కలపతో గృహోపకరణాలు, అలంకరణ ఆకృతుల తయారీకి ఉపయోగించడం ఆనవాయితీ.
- పిల్లలకు వచ్చే ఉదర లోపాలకు రక్తచందన లేపనం, పండ్ల కషాయం జిగట విరేచనాల నివారణకు మందు. బెరడు పేస్టుతో చల్లదనంతో పాటు, తలనొప్పి నివారణ జరుగుతుంది.
- రెడ్‌శాండిల్ హెయిర్ డ్రైయింగ్, చర్మ సౌందర్యం సాధనంగా ఉపయోగపడుతుంది.

పెంపకంపై నిషేధం లేదు..



ఎర్రచందనం పెంపకంపై ఎటువంటి నిషేధం లేదు. సాధారణ తోటల పెంపకంలా పెంచుకోవచ్చు. చెట్లు నరకడానికి సాధారణ చెట్లు వలే అనుమతి పొందాలి. వాటి కలపతో సొంత అవసరాలు, గృహోపకరణాలు తయారు చేసుకోవచ్చు. విదేశాలకు ఎగుమతి చేయడానికే మాత్రమే నిషేధిత నిబంధనలు ఉన్నాయి.

– ఎల్.రామారావు,ఫారెస్ట్ రేంజర్, పాలకొండ



పాలకొండ నర్సరీలో సిద్ధంగా ఉన్న ఎర్రచందనం మొక్కలు

ఆదర్శపాఠశాలకు పురుగుల బియ్యం





ప్రభుత్వం సరఫరా చేసిన 25 కేజీల బియ్యం ప్యాకెట్లు, (ఇన్‌సెట్లో) మోడల్ పాఠశాలకు సరఫరా చేసిన బియ్యంలో సుంకి పురుగులు

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి వద్ద ఉన్న ఆదర్శ పాఠశాలకు ప్రభుత్వం పురుగుల బియ్యం సరఫరా చేయడంతో విద్యార్థులు, పాఠశాల సిబ్బంది ఆందోళన వ్యక్తంచేశారు. పాఠశాలలో సుమారు 480 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరి కోసం ఇటీవల ప్రభుత్వం సరఫరా చేసిన సన్న బియ్యం 25 కేజీల ప్యాకెట్లలో సుంకి పురుగులు ఉండడంతో వండేందుకు నిర్వాహకులు వెనుకంజవేస్తున్నారు. బియ్యంలో పురుగులు ఉన్న విషయాన్ని మండల పౌర సరఫరాల అధికారి సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి మార్చుతామని చెప్పారు.

రైతు ఇంట్లో చోరీ

పార్వతీపురం రూరల్: పట్టణ పరిధి శివారు ప్రాంతంలో ఉన్న ఆశాజ్యోతి ఆశ్రమం సమీపంలో ఓ రైతు ఇంట్లో మంగళవారం చోరీ జరిగినట్లు పట్టణ ఎస్సై జగదీష్ నాయుడు తెలిపారు. ఈ మేరకు ఆయన వివరాలు వెల్లడిస్తూ ఆశాజ్యోతి ఆశ్రమం సమీపంలో నివాసం ఉంటున్న వంగపండు తిరుపతి రావు అనే వ్యక్తి భార్యతో కలిసి మంగళవారం వేకువజామున నాలుగు గంటల సమయంలో పొలం పనుల నిమిత్తం వెళ్లి పనులు ముగించుకుని మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఇంటికి వెళ్లి చూడగా బీరువా తెరచి ఉన్నట్లు గమనించారని, బీరువాలో ఉన్న నాలుగున్నర తులాల బంగారంతో పాటు రూ.20 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించిన బాధితుడు తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్సై జగదీష్ నాయుడు, సిబ్బంది

రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలిగా జ్యోత్స్న



వాకముల్ల జ్యోత్స్న



లలితకుమారి

రాజాం: రేషన్ డీలర్ల అసోషియేషన్ రాష్ట్ర కార్యవర్గంలో రాజాం మండలానికి చెందిన ఇద్దరు మహిళా డీలర్లకు అవకాశం లభించింది. ఈ ఎన్నికల్లో రేషన్ డీలర్ల సమాఖ్య రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా రాజాం మండలం అంతకాపల్లి డిపోకు చెందిన వాకముల్ల జ్యోత్స్న దేవి ఎన్నిక కాగా, సహాయ కార్యదర్శిగా రాజాం పట్టణంలని ఠాణావీధి డిపోకు చెందిన లలితాకుమారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాజాం డీలర్ల సంఘం మంగళవారం విలేకరులకు తెలిపింది. వారిద్దరిని రాజాం డీలర్ల అసోషియేషన్ అభినందించింది.

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపడుతున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసచౌదరి

విజయనగరం టౌన్: విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌గా వై.శ్రీనివాసచౌదరి మంగళవారం కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అసిస్టెంట్ కమిషనర్‌గా కృష్ణాజిల్లాలో పనిచేసి, పదోన్నతిపై ఉమ్మడి విజయనగరం జిల్లాకు ఆయన బదిలీపై వచ్చారు. ఈ మేరకు ఎక్సైజ్ ఉన్నతాధికారులు, సిబ్బంది శ్రీనివాస చౌదరిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

ఒడిశా నుంచి వచ్చే రైళ్లలో తనిఖీలు

పార్వతీపురం రూరల్: రాయ్‌పూర్–విశాఖ పాసింజర్ ట్రైన్‌లో గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణా నిర్మూలనకు ఈగల్ టీం ఐజీ ఆకె రవికృష్ణ, ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి ఆదేశాలతో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం పేరిట మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈగల్ టీం, జిల్లా పోలీసు శాఖ, డాగ్ స్క్వాడ్, ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు సంయుక్తంగా ఈ తనిఖీలు నిర్వహించారు. ఒడిశా నుంచి ఆంధ్రాకు గంజాయి అక్రమ రవాణాను అరికట్టే ఉద్దేశ్యంతో ఒడిశా ప్రాంతాల నుంచి వచ్చే రైళ్లలో జనరల్ బోగీల నుంచి ఏసీ బోగీల వరకు ముమ్మరంగా పోలీసులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ అక్రమ రవాణా నిర్మూలనకు టోల్‌ఫ్రీ నంబర్ 1972 ఏర్పాటు చేశామని ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ నంబర్ ద్వారా సమాచారం ఇస్తే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుని సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. పలు శాఖల పోలీసు అధికారులతో పాటు డాగ్ స్క్వాడ్ బృందం, బీడీ బృందం సహాయంతో లగేజీలను, వ్యక్తులను తనిఖీలు చేశారు. తనిఖీల్లో పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషికుమారి, డాగ్ స్క్వాడ్, బీడీ బృందం, ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ సిబ్బంది పాల్గొన్నారు.

సుపరిపాలన తొలిఅడుగు విఫలం

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్ తదితరులు

రేగిడి: కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. గ్రామాల్లోకి కూటమి ప్రభుత్వ నాయకులు వెళ్లేటప్పుడు స్పందన కరువవడంతోనే ఈ కార్యక్రమం విఫలమైందన్నారు. ఈ మేరకు మంగళవారం రేగిడి వచ్చిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చకపోవడంతో గ్రామాల్లోకి వెళ్తున్న నాయకులను ప్రజలు నిలదీస్తుండడంతో నాయకులు కూడా ఈ కార్యక్రమంలో తూతూ మంత్రంగా పాల్గొంటున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి పిలుపుమేరకు చంద్రబాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని గ్రామాల్లోకి వెళ్లి నిర్వహిస్తుంటే ప్రజల నుంచి మంచి విశేష స్పందన వస్తోందన్నారు. 2024 జనవరి నెలలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కొత్త పింఛన్లు మంజూరుచేస్తే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఒక్క కొత్త పింఛన్ కూడా మంజూరుచేయలేదని ఎద్దేవా చేశారు. కొత్త పింఛన్ల కోసం వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు ఎదురు చూస్తున్నారని అన్నారు. తల్లికి వందనం ఇప్పటికీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని కలెక్టర్ గ్రీవెన్స్‌కు వస్తున్న ఫిర్యాదులను ప్రభుత్వం గమనించాలని సూచించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు, ఉపాధ్యక్షుడు కెంబూరు వెంకటేశ్వరరావు, కరణం శ్రీనివాసరావు, కెల్ల మన్మథరావు, కింజరాపు సురేష్ పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డెస్‌డ్	స్కిన్‌లెస్
₹105	₹180	₹190

ఐదో సారీ..!

- పత్తికాయవలస రేషన్ డీలర్ తొలగింపు
- నాలుగుసార్లు కోర్టు నుంచి అనుమతి
- తాజాగా ఐదోసారి అడ్డగోలుగా తొలగింపు
- ఎలాంటి నోటీసులు లేకుండానే డిపో స్వాధీనం
- కొనసాగుతున్న కూటమి కక్ష సాధింపు

చీపురుపల్లి: కూటమి ప్రభుత్వం కక్ష సాధింపుల పర్వం కొనసాగుతోంది. వారికి అనుకూలంగా లేకపోతే ఉద్యోగమైనా, ఉపాధి అయినా వేరే ఇంకేదైనా సరే వేటు తప్పడం లేదు. గడిచిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పని చేయనక్కర్లేదు కూటమి నాయకులకు అనుమానం వస్తే చాలు తక్షణమే అలాంటి వారిపై వేటు పడుతోంది. మా ఊళ్లో మనకు వ్యతిరేకంగా పని చేస్తున్నాడు. వాడు మనవాడు కాదు. ఒక్క చూపు చూడండని అధిష్టానం దృష్టికి తీసుకువెళ్తే చాలు. వెంటనే అక్కడి నుంచి అధికారులకు ఫోన్లు రావడం అధికారులు రంగప్రవేశం చేయడం ఏళ్ల తరబడి పని చేస్తున్న వారి పొట్ట కొట్టడం. దీనికి చీపురుపల్లి మండలంలోని పత్తికాయవలస గ్రామంలో రేషన్ డిపో ఉదంతం అద్దం పడుతోంది. అక్కడి రేషన్ డిపో డీలర్ నీలకంఠంను ఎలాగైనా తొలగించాలని కూటమి నేతలు కంకణం కట్టుకున్నారు. దీని కోసం కూటమి సర్కారు ఏర్పడినప్పటి నుంచే చర్యలు ప్రారంభించారు. అందులో భాగంగానే ప్రభుత్వం ఏర్పడిన 13 నెలల కాలంలో ఇప్పటికి నాలుగుసార్లు ఆ డీలర్‌ను తొలగించగా న్యాయస్థానాన్ని ఆశ్రయించి అనుమతులు తెచ్చుకున్నాడు. అయినప్పటికీ శాంతించని నేతలు ఆదేశాల మేరకు అధికారులు మరోసారి సోమవారం వేటు వేశారు. దీంతో పత్తికాయవలస డీలర్ తొలగింపు లెక్క ఐదోసారికి చేరుకుంది. ఏడాదిలో ఐదుసార్లు తొలగించడం వెనుక రాజకీయ కక్ష ఉందని మరోసారి న్యాయ పోరాటం చేస్తానని డీలర్ నీలకంఠం ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

ఎలాంటి నోటీసు లేకుండానే..

అధికార పార్టీ ఒత్తిళ్లతో తోనా? లేక మరింకేమైనా ఉందో గాని సోమవారం ఉదయం 11 గంటలకే పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ నాగమణి ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది డీలర్‌కు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే పత్తికాయవలస రేషన్ డిపోకు వెళ్లారు. అక్కడ డీలర్ లేకుండానే డిపోకు తాళం వేసి స్వాధీనం చేసుకున్నారు. విషయం తెలుసుకున్న డీలర్ నీలకంఠం అక్కడికి చేరుకుని తనకు సమాచారం లేకుండా ఎలాంటి నోటీసు లేకుండా రేషన్ డిపోకు తాళం ఎలా వేస్తారని, తగిన కారణాలు చూపించి నోటీసులు ఇవ్వాలని ప్రశ్నించాడు. దీంతో సాయంత్రం తహసీల్దార్ ధర్మరాజు, పోలీసులు డిపో వద్దకు వెళ్లారు. రేషన్ డిపోను స్వాధీనం చేసుకుని లోపల ఉన్న సరుకులను వేరే గ్రామ డీలర్‌కు అప్పగించారు.

ఏడాదిలో ఐదు సార్లు తొలగింపు

ఇదిలా ఉండగా పత్తికాయవలస రేషన్ డిపో డీలర్‌ను కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఐదు సార్లు తొలగించడం విశేషం. ఇంతవరకు నాలుగు సార్లు హైకోర్టును ఆశ్రయించి అనుమతులు తెచ్చుకుని డీలర్‌గా కొనసాగుతున్నాడు. 2025 ఫిబ్రవరిలో కూడా నాలుగో సారి హైకోర్టు నుంచి అనుమతులు తెచ్చుకున్నాడు.



సోమవారం రాత్రి పత్తికాయవలస రేషన్ డిపో వద్ద తహసీల్దార్, సీఎస్‌డీటీ, పోలీసులు

నాపై కక్ష సాధింపు

కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నాపై కక్ష సాధింపు జరుగుతోంది. ఇప్పటికే ఐదుసార్లు ఎలాంటి కారణం లేకుండానే సస్పెన్షన్ విధించారు. నాలుగు సార్లు హైకోర్టును ఆశ్రయించి ఉత్తర్వులు తెచ్చుకున్నాను. అయినప్పటికీ మళ్లీ నా పొట్టకొట్టేందుకు సిద్ధపడ్డారు. మళ్లీ న్యాయస్థానాన్ని ఆశ్రయించి న్యాయం కోసం పోరాటం చేస్తాను.

– నీలకంఠం, రేషన్ డిపో డీలర్, పత్తికాయవలస, చీపురుపల్లి మండలం



నోటీసు ఇవ్వకుండా డిపో ఎలా తరలిస్తున్నారని తహసీల్దార్‌ను ప్రశ్నిస్తున్న డీలర్ నీలకంఠం

ఫిర్యాదు మేరకు చర్యలు

పత్తికాయవలస డీలర్‌పై పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదులు అందాయి. వృద్ధులు, దివ్యాంగుల వేలిముద్రలు వేయించుకుని సరుకులు ఇవ్వడం లేదని ఫిర్యాదులు ఉన్నాయి. దీనిపై సీఎస్‌డీటీ నేతృత్వంలో విచారణ నిర్వహించాం. దీంతో పాటు డిపోలో సరుకుల నిల్వలో కూడా తేడాలు ఉన్నట్లు సీఎస్‌డీటీ, క్షేత్రస్థాయి అధికారులు గుర్తించి రిపోర్టు సమర్పించారు. దీనిపై విచారణ చేసి రేషన్ డిపో స్వాధీనం చేసుకుని పక్క గ్రామం డీలర్‌కు అప్పగించాం. పూర్తి నివేదికను ఆర్‌డీఓకు సమర్పిస్తున్నాం. ఆర్‌డీఓ నేతృత్వంలో తదుపరి చర్యలు తీసుకోనున్నారు.

– డి.ధర్మరాజు, తహసీల్దార్, చీపురుపల్లి

రోజుకో పంచలో పాఠశాల

- గోడు వెళ్లబోసినా పట్టించుకోని మంత్రి సంధ్యారాణి

సాలూరు రూరల్: మండలంలోని గంగన్న దొరవలస ప్రాథమిక పాఠశాలను రోజుకో పంచలో ఉపాధ్యాయులు నిర్వహిస్తున్నారు. పాఠశాల పాతభవనం శిథిలావస్థకు చేరుకోవడంతో దాని స్థానంలో కొత్తభవనం నిర్మాణానికి గత ప్రభుత్వంలో నాడు నేడు కార్యక్రమంలో భాగంగా నిధులు మంజూరు చేశారు. అయితే అప్పట్లో పనులు ప్రారంభించినప్పటికీ ఎన్నికల కారణంగా మధ్యలో భవన నిర్మాణం నిలిచిపోవడంతో విద్యార్థులకు నీడలేకుండా పోయింది. నిర్మాణంలో ఉన్న భవనం పక్కన చిన్న రేకుల షెడ్డులో 1,2 తరగతులు నిర్వహిస్తున్నారు. అలాగే 3,4,5 తరగతులు గ్రామంలో ఎవరి గడప ఖాళీగా ఉంటే వారి గడపలో తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ పరిస్థితి ఏడాదిగా కొనసాగుతున్నా ఇంతవరకు కూటమి ప్రభుత్వం పాఠశాల భవనానికి నిధులు మంజూరై ఉన్నప్పటికీ పనులు కొనసాగించకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యం ఇస్తామని ఒక వైపు ఊకదంపు డు ప్రచారం చేస్తుంటే మరోవైపు గ్రామాల్లో విద్యార్థులకు నిలువ నీడలేకుండా పోతోంది.

మంత్రికి విన్నవించినా స్పందన శూన్యం

5 నుంచి పది సంవత్సరాల వయసు ఉన్న విద్యార్థులు తమకు విద్యాబోధనకు ఒక చిన్న భవనాన్ని నిర్మించండి. రోజుకో పంచలో మా చదువులు కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితి ఏడాది కాలంగా జరుగుతోందని ఇటీవల కురుకూటి గ్రామంలో జరిగిన కూటమి ప్రభుత్వం తొలిఅడుగు సుపరిపాలన కార్యక్రమానికి వెళ్తున్న మంత్రి సంధ్యారాణి కాన్వాయిని అడ్డుకుని గ్రామస్తులతో పాటు విద్యార్థులు విన్నవించుకున్నారు. అయితే ఆ సమయంలో వినతిపత్రం ఇస్తున్నట్లు సెల్‌ఫోన్‌లో తీసిన ఫొటోలను మంత్రి సంధ్యారాణి దగ్గరుండి మరీ తొలగించినట్లు ఆ పార్టీ కార్యకర్తలే చెప్పుకుంటున్నారు. వినతి పత్రం ఇస్తున్నట్లు తీసిన ఫొటోలు తొలగించడంపై గ్రామంలో ఉన్న ఆ పార్టీ నాయకులే ముక్కున వేలేసుకుంటున్నారు.



మంత్రి కాన్వాయి వస్తుందని తెలిసి వినతిపత్రం ఇచ్చేందుకు రోడ్డుపై నిల్చున్న విద్యార్థులు(ఫైల్)